
గరిష్ఠం 30.0
కనిష్ఠం 24.6



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	590 (312.0450)	67,194	77,527
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.18 (4.46)	786.22	631.8
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174 (44.23)	49,570	50,974

చికెన్ ధరలు | లైవ్ : రూ.145 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250



సూర్యాపేటలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

వినాయక నిమజ్జనానికి సర్వం సిద్ధం

- భారీ పోలీస్ బందోబస్తుతో శోభయాత్రకు ఏర్పాట్లు
- అందుబాటులో గజ ఈతగాళ్లు.. పడవలు
- బందోబస్తులో 900 మంది పోలీసులు

జిల్లాలో నేడు గణనాథుల నిమజ్జనాన్ని వేడుకగా నిర్వహించనున్నారు. తొమ్మిది రోజులుగా గణేష్ విగ్రహాలను నెలకొల్పి భక్తిశ్రద్ధలతో ఎంతో ఘనంగా నవరాత్రోత్సవాలు నిర్వహించారు. జిల్లా అంతటా నేడు గణేష్ నిమజ్జనం చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. జిల్లాలో 38 ప్రదేశాల్లో నిమజ్జనం ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు వినాయక నిమజ్జనాలను పూర్తి చేసేలా అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. విగ్రహాల ఊరేగింపు భక్తుల డప్పు చప్పుళ్లు, కోలాటాలతో వైభవంగా శోభయాత్ర నిర్వహిస్తూ గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు.

- సూర్యాపేట(కలెక్టరేట్)

గణేష్ నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. రెవెన్యూ, మునిసిపల్, విద్యుత్ శాఖలు కూడా నిమజ్జనాల వద్ద బారీకేడ్లు, లైట్లు, క్రేన్లు ఏర్పాటు చేశాయి. కోదాడలో పెద్ద చెరువు వద్ద, మట్టపల్లిలో నిమజ్జనం చేయనున్నారు. కొంతమంది మూసీ ప్రాజెక్ట్ వద్ద నిమజ్జనం చేస్తారు.

జిల్లాలో సుమారు 3 వేల వరకు విగ్రహాలు

సూర్యాపేట జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది సుమారు 3వేల వరకు విగ్రహాలను నెలకొల్పారు. గత ఏడాది వినాయక చవితితో పోలిస్తే ఈ ఏడాది విగ్రహాల సంఖ్య తగ్గింది. భక్తులు ఖర్చుకు వెనకాడకుండా గణేష్ నవరాత్రోత్సవాలను ఎంతో భక్తిశ్రద్ధలతో గణనీయంగా నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టారు. కొంతమంది భక్తులు మూడవ, ఐదో రోజు విగ్రహాలను నిమజ్జనాలకు తరలించారు.

నిమజ్జన ప్రాంతాల్లో ఏర్పాట్లు పూర్తి

జిల్లాలో గణేష్ నిమజ్జనం సందర్భంగా భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ముఖ్యంగా గణేష్ విగ్రహాలను నీళ్లలో నిమజ్జనం చేసేందుకు అవసరమైన క్రేన్‌లను తెప్పించారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు గణేష్ విగ్రహాల నిమజ్జనం కొనసాగనుంది. అందుకోసం నిమజ్జన ప్రాంతాల్లో పెద్ద ఎత్తున విద్యుత్ లైట్లను ఏర్పాటుచేశారు. నీళ్లలోకి వెళ్లకుండా ఉండేందుకు చెరువులు, నదుల వద్ద బారీకేడ్లు ఏర్పాటుచేశారు. ప్రమాదవశాత్తు నీళ్లలో జారిపడితే వెంటనే రక్షించేందుకు జిల్లాలో మొత్తం 30మంది గజ ఈతగాళ్లతో పాటు పడవలను అందుబాటులో ఉంచారు. జిల్లాకేంద్రంలోని శోభాయాత్ర నిర్వహించే మార్గాలైన పొట్టిశ్రీరాములు సెంటర్, శంకర్ విలాస్ సెంటర్ మీదుగా, పూల సెంటర్ నుంచి పోస్టాఫీస్ చౌరస్తా మీదుగా కోర్టు చౌరస్తా, సద్దుల చెరువు మినీ ట్యాంక్ బండ్ వరకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మద్యం దుకాణాల బంద్

గణేష్ నిమజ్జనం సందర్భంగా జిల్లాలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ శాఖ అధికారులు జిల్లాలో మద్యం దుకాణాలను సోమవారం ఉదయం 10 గంటల నుంచి మంగళవారం ఉదయం 10 గంటల వరకు బంద్ చేయనున్నారు.

జిల్లాలో గణేష్ విగ్రహాల నిమజ్జన ప్రదేశాలు ఇవే..

జిల్లాలో గణేష్ విగ్రహాలను భక్తులు నిమజ్జనం చేసేందుకు అధికారులు ప్రత్యేకంగా ఎనిమిది ప్రదేశాల్లో ఏర్పాట్లుచేశారు. అందులో జిల్లాకేంద్రంలోని సద్దుల చెరువు, సూర్యాపేట రూరల్ మండలంలోని మూసీ ప్రాజెక్టు, కోదాడ పట్టణంలోని పెద్దచెరువు, మఠంపల్లి సమీపంలోని కృష్ణానది, చింతలపాలెం మండలంలోని బుగ్గమాధారం వద్ద, నేరేడుచర్ల మండలంలోని చిల్లేపల్లి వద్ద మూసీనదిలో, పాలకీడు మండలంలోని మహంకాళిగూడెం వద్ద కృష్ణానదిలో, అనంతగిరి మండలంలో పాలేరు వాగులో నిమజ్జనం చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లుచేశారు. ఇవే కాకుండా మండలాలు, గ్రామాల్లో ఇంకా 30 ప్రదేశాల్లో చెరువులు, కుంటల్లో కూడా గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు. ఈసారి నాగార్జునసాగర్ ఎడమకాల్వలో గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేసే అవకాశం లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం వద్ద నాగార్జునసాగర్ ఎడమకాల్వకు రెండు చోట్ల గండ్లు పడడంతో అధికారులు నీటి విడుదలను నిలిపి వేశారు. దీంతో సాగర్ కాల్వల్లో నీళ్లు లేకపోవడంతో నిమజ్జనం చేసే వీలులేకుండా పోయింది.

ప్రశాంతంగా శోభాయాత్రను నిర్వహించాలి

జిల్లాలో గణేష్ శోభాయాత్రను భక్తులు ప్రశాంతంగా నిర్వహించాలి. తొమ్మిది రోజులుగా అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించడం హర్షనీయం. గణేష్ నిమజ్జనానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. భక్తులకు ఎక్కడ కూడా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నాం. నిమజ్జనానికి తరలించే వాహనాల్లో చిన్నారులను అనుమతించవద్దు. జిల్లాలో విగ్రహాలకు ఉదయం సమయంలోనే పూజలు పూర్తిచేసి నిమజ్జనానికి తరలించాలి. ఎక్కడ కూడా ఘర్షణ వాతావరణాలకు అవకాశం ఇవ్వవద్దు.

- తేజస్ నందలాల్ పవార్, కలెక్టర్

భారీ బందోబస్తు

జిల్లాలో సోమవారం నిర్వహించనున్న గణేష్ నిమజ్జనానికి భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఆధ్వర్యంలో జిల్లాలో గణేష్ నిమజ్జన బందోబస్తులో సుమారు 900మంది పోలీసులు విధుల్లో పాల్గొననున్నారు. జిల్లాలో శాంతి భద్రతలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఇతరులకు ఇబ్బంది కల్గించకుండా గణేష్ శోభాయాత్ర నిర్వహించుకోవాలని ఎస్పీ సూచించారు. శోభయాత్రలో డీజేలను నిషేధించారు. గణేష్ విగ్రహాలను తీసుకెళ్లే వాహనాలపై ఎక్కువ మంది ఉండకూడదని, 15 సంవత్సరాలలోపు పిల్లలకు అనుమతి లేదన్నారు. పోలీసులు సూచించిన ప్రకారం నిమజ్జనానికి విగ్రహాలను తరలించే విధంగా ఇప్పటికే ప్రణాళిక సిద్ధంచేశారు. నిమజ్జన సమయంలో వీధుల్లో విద్యుత్ తీగలుంటాయని, వాటిపట్ల జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచించారు. మద్యం సేవించి ఘర్షణ వాతావరణం సృష్టించవద్దన్నారు. పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, స్పెషల్ పెట్రోలింగ్ వాహనాల ఏర్పాటు, క్విక్ రియాక్షన్ టీమ్స్, ఐడీ పార్టీ, షీ టీమ్ బృందాలు ప్రత్యేకంగా బందోబస్తు నిర్వహించనున్నాయి. మొత్తం శోభాయాత్ర దృశ్యాలను సీసీ కెమెరాల నిఘాతోపాటు వీడియో తీయనున్నారు.

నల్లగొండ జిల్లాలో 4,831 గణేష్ విగ్రహాలు



నల్లగొండలో వల్లభరావు చెరువు వద్ద ఏర్పాట్లు చేసిన సిబ్బంది

నల్లగొండ క్రైం: నల్లగొండ జిల్లావ్యాప్తంగా ఈనెల 16వ తేదీన (సోమవారం) గణేశ్ నిమజ్జన శోభాయాత్రను ప్రజలు ప్రశాంత వాతావరణలో నిర్వహించేలా పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 4,831 వినాయక విగ్రహాలు ఏర్పాటయ్యాయి. ఈ నేపథ్యంలో గణేశ్ నిమజ్జన శోభాయాత్రలో ఎలాంటి ఇబ్బందులు, ఘటనలు జరగకుండా పోలీసులు అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జిల్లాలోని అన్ని ప్రధాన రహదారులతో పాటు వివిధ కాలనీల్లో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ సీసీటీవీ కెమెరాలతోపాటు ప్రత్యేకంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి జిల్లా పోలీస్ కార్యాలయానికి అనుసంధానం చేశారు. ఈ సీసీ కెమెరాల ద్వారా జిల్లా కేంద్రంలోని కమాండ్ కంట్రోల్ రూం నుంచి అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని వినాయక విగ్రహాలు, మండపాలను జియో ట్యాగింగ్ చేసిన పోలీసులు మండపాలకు నంబర్లు కేటయించారు. ఈ నెంబర్ల ప్రకారం శోభాయాత్రలో పాల్గొనాల్సి ఉంటుంది. నల్లగొండ పట్టణ కేంద్రంలోని అద్దంకి బైపాస్ పానగల్ సమీపంలో ఉన్న వల్లభరావు చెరువు వద్ద తొమ్మిది అడుగులలోపు విగ్రహాలు నిమజ్జనం చేసేలా ఏర్పాట్లు చేశారు. తొమ్మిది అడుగులకు పైబడిన విగ్రహాలు సాగర్ రోడ్డులోని 14వ మైలురాయి వద్ద నిమజ్జనం చేసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.

యాదాద్రి జిల్లా అంతటా నిమజ్జన కోలాహలం



భువనగిరి పెద్ద చెరువు వద్ద ఏర్పాట్లు చేసిన సిబ్బంది

భువనగిరి టౌన్: నవరాత్రులపాటు పూజలందుకున్న ఏకదంతుడు గంగమ్మ ఒడికి చేరనున్నాడు. ఈ మేరకు సోమవారం జిల్లాఅంతటా గణేష్ నిమజ్జన శోభాయాత్రను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లావ్యాప్తంగా 3,067 విగ్రహాలను ప్రతిష్ఠించగా ఈపాటికే సుమారు 500 విగ్రహాలను నిమజ్జనం చేయగా సోమవారం జిల్లా అంతటా 2వేల విగ్రహాలను సమీపంలోని చెరువులు, కుంటలు, కాల్వల్లో నిమజ్జనం చేయనున్నారు. మిగతా విగ్రహాలను 20లోపు నిమజ్జనం చేయనున్నారు. గణేష్ శోభాయాత్ర, నిమజ్జనం సజావుగా సాగేందుకు పలు ప్రభుత్వ శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నాయి. జిల్లా అంతటా 500 మందికిపైగా బలగాలతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. భువనగిరి పెద్ద చెరువులో నిమజ్జనోత్సవం సజావుగా సాగేలా రెండు క్రేన్లను ఏర్పాటు చేశారు. చెరువులో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. చెరువు అంతటా భారీకేడ్లు ఏర్పాటుచేసి లైట్లు బిగించారు. అత్యసర వైద్య సేవల కోసం వైద్యశాఖ ఔట్ పోస్టును ఏర్పాటు చేసి అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచనుంది. తాగునీటిని ఏర్పాటు చేశారు. బీబీనగర్, రాయిగిరి, వలిగొండ, సంగెం, తుమ్మలగూడెం, తదితర చెరువుల వద్ద కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రజల హృదయాల్లో 'జిట్టా'

హర్యానా రాష్ట్ర గవర్నర్ దత్తాత్రేయ

తెలంగాణ సాధన కోసం జీవితాన్ని త్యాగం చేసిన జిట్టా బాలకృష్ణారెడ్డి ప్రజల హృదయాలను గెలుచుకున్న నేత అని హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నా రు. ఆదివారం భువనగిరిలో నిర్వహించిన జిట్టా సంస్మరణ సభలో పాల్గొన్నారు. అంతకుముందు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జిట్టా బాలకృష్ణారెడ్డి కుటుంబాన్ని పరామర్శించి నివాళుల ర్పించారు.

- భువనగిరి టౌన్

5



జిట్టా బాలకృష్ణారెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బండారు దత్తాత్రేయ

యాదగిరికొండపై భక్తుల రద్దీ

లక్ష్మీనృసింహుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కొండపై ఆదివారం వారాంతపు భక్తుల రద్దీ కొనసాగింది. 20వేల మంది భక్తులు లక్ష్మీనృసింహుడిని దర్శించుకోగా, ధర్మ దర్శనానికి గంట, వివీపీ టికెట్(రూ.150) దర్శనానికి అరగంట సమయం పట్టింది. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 40,05,735 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు.

- భువనగిరి అర్బన్

4



యాదగిరికొండపై క్యూలైన్లలో భక్తుల రద్దీ

ఆయిల్‌పామ్ రైతులకు శుభవార్త

- కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం
- దిగుమతి సుంకాన్ని పెంచిన మోదీ ప్రభుత్వం
- ఆయిలపామ్ గెలల ధరలు పెరిగే అవకాశం
- ఉమ్మడి జిల్లాలో సాగు విస్తీర్ణానికి ప్రోత్సాహం
- నల్లగొండ, సూర్యాపేట మధ్యలో ఫ్యాక్టరీ ?



ఆయిల్‌పామ్ రైతులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ముడి పామాయిల్ దిగుమతి సుంకాన్ని పెంచుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు దిగుమతి సుంకాన్ని 5.5శాతం నుంచి ఏకంగా 27.5శాతానికి పెంచుతూ ఉత్తర్వులను జారీ చేసింది. దీంతో ఉమ్మడి జిల్లాలోని 17,500 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులకు మేలు కలగనుంది. ప్రస్తుతం టన్ను ఆయిల్ పామ్ గెలల ధర రూ.14,392ఉండగా అది టన్నుకు రూ.1500 నుంచి రూ.1700వరకు అదనంగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. మొత్తంగా అయిల్ పామ్ గెలల ధర టన్నుకు రూ.16,500కు పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఆయిల్‌పామ్ గెలల ధరలు పెరిగి ఆర్థికంగా లాభాలబాట పట్టే అవకాశాలు మెండుగా కన్పిస్తున్నాయి. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్‌పామ్ సాగు కు ప్రత్యేక చర్యలు తీసుకుంటుండడంతో నియోజకవర్గాల వారీగా సాగు పెంచే లక్ష్యంతో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాల మధ్యలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

- నల్లగొండ

5

కన్నుల పండువగా ముత్యాలమ్మ జాతర





హుజూర్‌నగర్‌లో ఊరేగింపుగా వస్తున్న ప్రభ బండ్లు, ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మతల్లి

హుజూర్‌నగర్, సెప్టెంబరు 15: పట్టణంలో ఆదివారం మొదటి రోజు ముత్యాలమ్మ జాతర కన్నుల పండువగా కొనసాగింది. మూడురోజుల జాతరలో భాగంగా ఆదివారం పెద్దముత్యాలమ్మకు భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు బోనాలు సమర్పించారు. ఆదివారం ఉదయం అర్చకులు నరగిరినాథుని రంగభట్రాచార్యులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున తొలి బోనం సమర్పించారు. నూతన పట్టు వస్త్రాలు, ఆభరణాలతో అమ్మవారిని ముస్తాబు చేసి జాతర ప్రారంభించారు. తెల్లవారు జామున 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు వేలాది మంది భక్తులు ముత్యాలమ్మతల్లిని దర్శించుకున్నారు. రైతులు సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు ట్రాక్టర్లు, ఎడ్లబండ్లకు ప్రభలు కట్టి పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించి ముత్యాలమ్మ దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు.

ముత్యాలమ్మతల్లి దీవెనలు అందరిపై ఉండాలి : మంత్రి ఉత్తమ్

ముత్యాలమ్మతల్లి దీవెనలు అందరిపై ఉండాలని మంత్రి ఉత్తమ్ కోరారు. ఆదివారం జాతర సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. అంతకుముందు పట్టణంలో అక్టోబర్ 27న నిర్వహించనున్న మహా రుద్రాభిషేకం పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో గుండా రమేష్, నర్సింగ్ వెంకటేశ్వర్లు, తండు సైదారత్నం, అరవిందరెడ్డి, రాము, నర్సయ్య, నర్సింహారావు, సురేష్‌రెడ్డి, జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌వి దిగజారుడు రాజకీయాలు

- కాంగ్రెస్‌ను విమర్శించడం తప్ప వారు చేసేదేమీ లేదు
- 'కాళేశ్వరం' ఘటనపై సుప్రీంకోర్టు జడ్జి విచారణ కొనసాగుతుంది
- త్వరలోనే నిజానిజాలు బయటకు వస్తాయి
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హుజూర్‌నగర్ పరిధిలోని ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌కు గండి పడిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్

హుజూర్‌నగర్, సెప్టెంబరు 15: బీఆర్ఎస్ దిగజారుడు రాజకీయాలు చేస్తోందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. హుజూర్‌నగర్ పరిధిలోని ఎంబీ కెనాల్ 14వ కిలో మీటర్ వద్ద గండి పడిన ప్రదేశాన్ని, రెడ్లకుంట మేజర్‌కు పడిన గండి ప్రదేశాన్ని, నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం వద్ద ఎడమ కాలువకు పడిన గండిని పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. వరదల్లో చనిపోయిన కుటుంబాలకు రూ.5 లక్షల సహాయం, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు, పంట నష్ట పరిహారం అందిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర బృందం పరిశీలకు వచ్చి పోయారని, నేటికీ పరిహారం అందించలేదన్నారు. అయినప్పటికి రాష్ట్ర ప్రభుత్వం సొంత ఖజానా నుంచి మరమ్మతులు, కాల్వలకు పడిన గండ్లను పూడుస్తున్నామన్నారు. బీఆర్ఎస్ నాయకులు బురద రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. దిగజారిన రాజకీయాల గురించి మాట్లాడాల్సిన పనిలేదని కేటీఆర్, హరీష్ రావు, ఆ పార్టీ నాయకులు విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. రాష్ట్రం లో 773 చోట్ల కాలువలు, చెరువులకు గండ్లు పడ్డాయన్నారు. బీఆర్ఎస్ నాయకులు కట్టించిన కాళేశ్వ రం ప్రాజెక్ట్ వాళ్ల హయాంలోనే కట్టి వాళ్ల హయాంలోనే కూలిపోయిందన్నారు. దీనిపై సుప్రీంకోర్టు జడ్జి విచారణ చేస్తున్నారని, నిజానిజాలు బయటకు వస్తాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులన్నీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తుందన్నారు. నెట్టెంపాడు, సీతారామ ప్రాజెక్ట్, దేవాదుల కల్వకుర్తి వంటి అన్ని ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. లక్షకోట్లతో కట్టిన కాళేశ్వరం నిధులు గోదావరిలో పారేసినట్లయిందన్నారు. నీటి పారుదలకు సీఎం అవసరమైన నిధులు కేటాయించారని, త్వరలోనే పనులు పూర్తి చేసి రైతులకు వారంరోజుల్లో నీళ్ళు అందించి పంటలు కాపాడతామన్నారు. ప్రతీ ఎకరాన్ని కాపాడుకుంటామన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, విపక్షాల మాటలు పట్టించుకోవద్దన్నారు. వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలో 5 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. హుజూర్‌నగర్ పరిధిలోని ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌కు పడిన గండిని పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో కలెక్టర్ తేజస్‌నందాలాల్, తన్నీరు మల్లికార్జున్‌రావు, యరగాని నాగన్నగౌడ్, ఈదుల్గంటి సుబ్బారావు, దొంగరి వెంకటేశ్వర్లు, గూడెపు శ్రీనివాసు, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, దొంగరి సత్యనారాయణ, అరుణ్‌కుమార్, శ్రీనివాస్ రెడ్డి, గెల్లి రవి, సంపత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, గోపిరెడ్డి, నిర్మల పాల్గొన్నారు.

చిలుకూరు: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో సాగర్ కాల్వలకు పడిన గండ్లను తక్షణమే పూడ్చివేయాలని మంత్రి ఉత్తమ్ సూచించారు. మండల పరిధిలోని ఆర్లెగూడెం గ్రామం వద్ద రెడ్లకుంట మేజర్ కాల్వకు పడిన గండిని, ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌కు కరక్కాయలగూడెం వద్ద పడిన గండ్లను ఆయన పరిశీలించారు. ఆయన వెంట చీఫ్ ఇంజనీర్ రమేష్‌బాబు, ఎస్ఈ శివధర్మతేజ, ఏఈలు సత్యనారాయణ, రామకిషోర్, ఆర్డీవో సూర్యనారాయణ, తహసీల్దార్ ధ్రువకుమార్, డీఈ స్వప్న, ఏఈ ఉన్నారు.

మోతె: మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి కలెక్టర్ తేజస్‌నంద్ పవార్ మామిళ్లగూడెం టోల్‌ప్లాజా వద్ద స్వాగతం పలికారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ వచ్చిన ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ముప్పాని ఆశ, సంతోష్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

వారంలోగా గండ్లు పూడ్చుతాం

నడిగూడెం: రేయింబవళ్లు కష్టపడి... వారంలోగా గండ్లు పూడ్చుతామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. నడిగూడెం మండలం కాగితరామచంద్రాపూరం వద్ద సాగర్ ఎడమ కాల్వపై పడిన రెండు గండ్ల పూడ్చివేత మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. నీటివిడుదల త్వరగా చేస్తేనే పంటలు చేతికి వస్తాయని రైతులు మంత్రి దృష్టికితీళ్లగా గండ్ల పూడ్చివేతపై కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్సారెస్పీ సీఈ రమేష్ బాబులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెండుచోట్ల పడిన గండ్లను పూడ్చాలంటే నెల రోజులు పడుతుందని, అయితే రాత్రింబంవళ్లు పనిచేసైనా వారంలోగా గండ్లు పూడ్చి సాగర్ జలాలు రైతులకు అందిస్తామన్నారు. దీంతో రైతుల పొలాలకు పంట నష్టం జరగకుండా వేగంగా మర్మతులు పూర్తిచేసి రైతులను ఆదుకుంటామన్నారు. స్పాట్ టెండర్‌ను దక్కించుకున్న సంస్థకూడా వేగంగా మరమ్మతు పనులు చేపడుతుందన్నారు. నష్టం అంచనాపై కేంద్ర బృందం పరిశీలించగా వారికి అత్యవసర స్థితిని వివరించామని, వారిచ్చే నివేదిక ద్వారా నిధులు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, సీఈ రమేష్‌బాబు, ఈఈ రాంకిషోర్ ఉన్నారు.

తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి



సూర్యాపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఫోరం సభ్యులు

సూర్యాపేటటౌన్, సెప్టెంబరు 15: రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్, టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంట్ల ధర్మార్జున్ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఈ నెల 27వతేదీన జరిగే తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీ య సమ్మేళనం వాల్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులు స్వరాష్ట్రం కోసం తమ జీవితాలను, సమయాన్ని, ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణ సాధించారని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల సమస్యలు పరిష్కారించాలని కోరు తూ రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన ఉద్యమకారుల జన చైతన్య యాత్ర బృందం ఆదివారం జిల్లా కేంద్రానికి చేరుకుందన్నారు. తెలంగాణ ఉద్యమకారులను ఆదుకునేలా తెలంగాణ ఉద్యమ కారుల కార్పొరేషన్ వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశా రు. ఈ నెల 27న సికింద్రాబాద్‌లోని హరిహర కళా భవన్‌లో జరిగే సభకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అనంతుల మధు, నారబోయిన కిరణ్, దరావత్ నాగేశ్వర్‌రావునాయక్, అంజయ్య, సంతోష్‌రెడ్డి, పడిదల ప్రసాద్, సుదర్శన్‌రెడ్డి, ఐలయ్య పాల్గొన్నారు.

'ప్రజాపాలన' దినోత్సవ
ముఖ్య అతిథి మార్పు

- మంత్రి ఉత్తమ్‌కు బదులుగా బీసీ కమిషన్ చైర్మన్

సూర్యాపేట(కలెక్టరేట్), సెప్టెంబరు 15: జిల్లా కేంద్రంలో ఈ నెల 17వ తేదీన నిర్వహించే 'ప్రజాపాలన' దినోత్సవంలో జెండా ఆవిష్కరణ చేసే ప్రజా ప్రతినిధుల పేర్లను మార్పు చేస్తూ ప్రభుత్వం ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. గత ప్రభుత్వం సెప్టెంబరు 17ను తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంగా ప్రకటించిన విష యం తెలిసిందే. అయితే సూర్యాపేట కలెక్టరేట్‌లో నిర్వహించే కార్యక్రమంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పతాకావిష్కరణ చేయాల్సి ఉండగా, ఈ నెల 17, 18, 19 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించే ఇంటర్నేషనల్ ఇరిగేషన్ కాన్ఫరెన్స్‌కు మంత్రి హాజరుకావల్సి ఉంది. దీంతో మంత్రి స్థానంలో బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ జెండా ఆవిష్కరణ చేస్తారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి ఉత్తర్వులు జారీ చేశారు.



యాదగిరికొండపై భక్తుల రద్దీ


పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు


క్యూలైన్లలో భక్తుల రద్దీ

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 15: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో యాదగిరికొండ ఆదివారం రద్దీగా మారింది. వారాంతపు సెలవు రోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకు నేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 20వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి వచ్చారు. ప్రత్యేక, ధర్మదర్శన క్యూలైన్లు భక్తులతో రద్దీ నెలకొంది. ప్రధానాలయం, కల్యాణోత్సవం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాలల్లో వద్ద కూడా రద్దీ నెలకొంది. ఆలయ ఉత్తర దిశలో భక్తులు ఫొటోలు దిగేందుకు పోటీ పడ్డారు. భక్తులను కొండపైకి తరలించేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేశారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.40,05,735ల ఆదాయం సమకూ రినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. సుప్రభాత సేవతో స్వామి అమ్మవారిని మేల్కొపిన అర్చకస్వాములు స్వయంభువులకు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా చేపట్టారు.

అదేవిధంగా పాతగుట్ట స్వామి అమ్మవారికి నిత్య పూజలు ఘనంగా చేపట్టారు. శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో జరిపారు. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వారబంధనం చేశారు. కాగా, ఎమ్మెల్సీ సీహెచ్ నవీన్‌కుమార్(తీన్మార్ మల్లన్న) కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు స్వామిఅమ్మవారలకు ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా ఈవో లడ్డు ప్రసాదం అందజేశారు. అదేవిధంగా ఈ నెల 18న వ్రత మండపంలో హుండీ కానుకల లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు.


అందుబాటులోకి డిజిటల్ సేవలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రసాదం టికెట్లు డిజిటల్ సేవల ద్వారా అందుతున్నాయి. ఇప్పటి వరకు ఆఫ్‌లైన్ ద్వారా మాత్రమే అందించే ప్రసాద టికెట్లలో గతంలో అవకతవకలు జరుగుతున్నట్లు ఆరోపణల నేపథ్యంలో డిజిటల్ సేవలు అందించేందుకు అధికారులు కంప్యూటరైజ్డ్ సేవలు అందుబాటులోకి తెచ్చారు. గతంలో ఈసీఐఎల్‌తో జరిగిన ఒప్పందంలో భాగంగా తిరిగి వీటిని పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టారు. పీవోఎస్‌కు సంబంధించిన ఏడు సిస్టంలు, స్కానర్లు అందుబాటులో ఉన్నాయి. అందులో ఐదు వాడకంలోకి రాగా అత్యవసర పరిస్థితిలో వాడేందుకు మిగతా వాటిని అందుబాటులో ఉంచారు. టికెట్, ప్రసాదం పొందేందుకు వేర్వేరు కౌంటర్లు ఏర్పాటు చేయగా డిజిటల్ సేవల ద్వారా భక్తుడు ఎన్ని కొనుగోలు చేసింది స్కాన్ ద్వారా సరిపోలుతున్నాయి. ఎన్ని టికెట్లు, ప్రసాదాలు భక్తులు పొందే వివరాలు కంప్యూటర్‌లో నిక్షిప్తం అవుతున్నాయి. దీంతో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా డిజిటల్ సేవల ద్వారా టికెట్, ప్రసాద కౌంటర్‌లో పారదర్శకంగా భక్తులకు సేవలు అందిస్తున్నామని ఈవో భాస్కర్‌రావు తెలిపారు.





















మాజీ ఎంపీపీ భర్తపై హత్యాయత్నం

● కత్తితో దాడి చేసిన యువకుడు, పరిస్థితి విషమం


చికిత్సపొందుతున్న శ్రీనివాస్‌రెడ్డి

త్రిపురారం, సెప్టెంబరు 15: నల్లగొండ జిల్లా త్రిపురారం మాజీ ఎంపీపీ భర్త శ్రీనివాస్ రెడ్డిపై హత్యాయత్నం జరిగింది. ఆదివారం సాయంత్రం ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో అదే వీధిలో నివాసముంటున్న యువకుడు కత్తితో దాడి చేశాడు. ఎస్‌ఐ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మాజీ ఎంపీపీ అనుముల పాండమ్మ భర్త శ్రీనివాస్‌రెడ్డి సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఇంట్లో నిద్రిస్తుండగా ఆదే వీధిలో నివాస ముంటున్న అనుముల రాజేందర్‌రెడ్డి అనే యువకుడు మద్యం మత్తులో ఇంట్లోకి వచ్చి కత్తితో దాడి చేశాడు. కత్తిపోట్లకు గురైన శ్రీనివాస్‌రెడ్డి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి తీవ్రంగా గాయపడిన ఆయనను మొదట స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. రాజేందర్‌రెడ్డి బంధువులకు సంబంధించిన భూ పంచాయితీలో శ్రీనివాస్‌రెడ్డి పెద్దమనిషిగా వ్యవహరిస్తున్నందునే కక్షతో దాడి చేసినట్లు ఆయనపై భార్య పాండమ్మ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో కార్మికుడికి గాయాలు

శాలిగౌరారం, సెప్టెంబరు 15: భవననిర్మాణ పనులు చేస్తుండగా 33కేవీ విద్యుత్ తీగలు తగిలి ఛత్తీస్‌ఘడ్‌కు రాష్ట్రానికి చెందిన కూలీ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. ఛత్తీస్‌ఘడ్‌కు రాష్ట్రానికి చెందిన మహావీర్ అనే భవన కార్మికుడు శాలిగౌరారం మార్కెట్‌లో భైరవునిబండ రోడ్డులో భవన నిర్మాణ పనులు చేస్తున్నాడు. ఈ భవనం వెనుక శాలిగౌరారం సబ్‌స్టేషన్ నుంచి ఆకారం సబ్‌స్టేషన్‌కు సరఫరా చేసే 33కేవీ విద్యుత్ లైన్‌ఉంది. మహావీర్ పనిచేస్తున్న క్రమంలో ఇనుప రాడ్డు ప్రమాదవశాత్తు 33కేవీ తీగలకు తగలడంతో విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడ్డాడు. సగం శరీరం వరకు కాలిపోయి అపస్మారక స్థితిలో పడిపోయాడు. అక్కడే పనిచేస్తున్న కార్మికులు, స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో నకిరేకల్‌లోని ఓ ప్రైవేట్ తరలించారు. మహావీర్ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు తెలిపారు. కార్మికుడు విద్యుదా ఘాతానికి గురైన సమయంలో సబ్‌స్టేషన్‌లో భారీ శబ్దం వచ్చి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆ లైన్‌లోని ఇళ్లలోని టీవీలు, ఫ్రిడ్జిలు, మీటర్లు, విద్యుత్ పరికరాలు కాలిపోయాయి. సుమారు రూ.5లక్షల విలువైన గృహోపకరణాలు కాలిపోయాయని బాధితులు తెలిపారు. రెండు సంవత్సరాల క్రితం గుజలాల్ శేఖర్‌బాబు సతీమణి రమణ కూడా 33కేవీ లైన్‌తీగ తగిలి విద్యుదాఘాతానికి గురై గాయపడింది. ఇళ్ల మధ్య నుంచి 33కేవీ విద్యుత్ తీగలు వెళ్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

చౌటుప్పల్ రూరల్ సెప్టెంబరు 15: యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట శివారులో ఆదివారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని పాడుపడిన రేకుల ఇంట్లో మృతదేహాన్ని గుర్తించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి వయస్సు సుమారు 55సంవత్సరాలకు పైగా ఉండొచ్చని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

హత్యాయత్నం కేసులో రౌడీషీటర్ అరెస్ట్

కనగల్, సెప్టెంబరు 15: బీరు బాటిల్ ఇవ్వలేదని వైన్స్‌షాపులో పనిచేస్తున్న వ్యక్తిపై దాడి చేసిన రౌడీషీటర్‌ను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చినమాదారం గ్రామానికి చెందిన రౌడీషీటర్ మల్లికంటి యాదగిరి ఈ నెల 13వ తేదీ సాయంత్రం ఎస్‌లింగోటం స్టేజీ వద్ద గల కావేరి వైన్స్‌కు బీరు బాటిల్ కోసం వెళ్లాడు. వైన్‌షాపులో పనిచేస్తున్న మేకల రవిని ఉద్దెర ఇవ్వాలని కోరగా అతను నిరాకరించాడు. దీంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో కౌంటర్ బల్లమీద ఉన్న బీరుసీసాతో యాదగిరి రవి తలపై దాడి చేశాడు. అనంతరం రవి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు యాదగిరిని ఆదివారం అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

పెద్దవూర, సెప్టెంబరు 15: నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని బెట్టలతండా సమీపంలో హైదరాబాద్- నాగార్జునసాగర్ రోడ్డుపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిల్లా బల్లికురవ మండలం కొండదిన గ్రామానికి చెందిన బండి గాబ్రియల్ హైదరాబాద్‌లో తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. హైదరాబాద్ నుంచి ఆదివారం తమ స్వగ్రామానికి వెళ్తున్నాడు. నాగార్జునసాగర్ సమీపంలోని బెట్టలతండా సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి పక్కన ఉన్న బండరాయికి ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్‌ఐ వీరబాబు అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో తన వాహనంలో నాగార్జునసాగర్‌లోని కమలానెహ్రూ ఆసుపత్రికి తరలించారు. యువకుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

ప్రభుత్వ వాహనం ఢీకొని వ్యక్తి మృతి


పోలీసులతో వాగ్వాదానికి దిగిన జీడయ్య కుటుంబసభ్యులు


జీడయ్య (ఫైల్)

గరిడేపల్లి, సెప్టెంబరు 15: ప్రభుత్వ వాహనం వెనుకనుంచి బైక్‌ను ఢీ కొని వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన ఆదివారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలకేంద్రంలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెంకట్రాంపురం గ్రామానికి చెందిన కీసరి జీడయ్య(42) మండల కేంద్రం నుంచి అబ్బిరెడ్డిగూడెం వ్యవసాయ పనుల నిమిత్తం ఉదయం 8:30 సమయంలో బైక్‌పై వెళ్తున్నాడు. అదే సమయంలో మిర్యాలగూడెం నుంచి హుజూర్‌నగర్ వెళుతున్న పోలీస్ వాహనం వెనకాల నుంచి ఢీకొనడంతో జీడయ్య కింద పడి కారు ముందు దొర్లుకుంటూ కొంత దూరం వెళ్లాడు. గమనించిన స్థానికులు వెంటనే 108కు ఫోన్‌చేసి క్షతగాత్రుడిని మిర్యాలగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మిర్యాలగూడెం ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుంటుంబ సభ్యులకు అప్పగించారు.

ప్రభుత్వ వాహనమైతే ఎవరినైనా చంపేస్తారా?

ప్రమాదానికి కారణమైన ప్రభుత్వ వాహనం కావడంతో మృతుడి కుటుంబానికి న్యాయం చేయలని బాధితుడి కుటుంబసభ్యులు, బంధువులు సాయంత్రం ఐదు గంటల సమయంలో పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. మృతదేహాన్ని అంబులెన్స్‌లో కోదాడ, మిర్యాలగూడెం ప్రధాన రహదారిపై ఉంచి పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నాకు చేశారు. మొదట పోలీసులు, గ్రామ నాయకులు ఎంత చెప్పినా బాధితులు వినలేదు. బాధితుడి కుటుంబానికి న్యాయం జరిగే వరకు ధర్నా విరమించేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. ప్రమాదానికి గురైన వాహనం నంబర్ ప్లేట్ తొలగించారని, డ్రైవర్‌ను ఎక్కడకు పంపించారని, ప్రభుత్వ వాహనం అయితే ఎవరినైనా చంపుతారా అని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. సమయంలో మం డల నాయకులు త్రిపురం అంజన్‌రెడ్డి, పయిడిమర్రి రంగనాథ్, పెండెం శ్రీనివాస్‌గౌడ్‌లు వెంకట్రాంపురం గ్రామస్థులకు నచ్చజెప్పే ప్రయత్నం చేయగా, వారు వినిపించుకోకపోవడంతో, అసహనానికి గురైన పోలీసులు మృతదేహం ఉన్న వాహనాన్ని తీసేసేందుకు ప్రయత్నం చేశారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు స్పెషల్ పోలీసులతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. సీఐ, నాయకులు, ఎస్‌ఐ కలిసి బాధిత కుటుంబ సభ్యులను, గ్రామానికి చెందిన పెద్ద మనుషులతో మాట్లాడి బాధిత కుటుంబానికి నష్టపరిహారం ఇప్పిస్తామని చెప్పడంతో శాంతించిన బాధితులు రాస్తారోకో విరమించారు. సుమారు రెండున్నర గంటలు పాటు రాస్తారోకో నిర్వహిం చడంతో మిర్యాలగూడ, కోదాడ ప్రధాన రహదారిపై ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అనంతరం పోలీసులు ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. జీడయ్య భార్య వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ. చలిగంటి నరేష్ తెలిపారు.

ఆయిల్‌పామ్ రైతులకు శుభవార్త


చండూరులో నిర్వహించిన అవగాహన సదస్సుకు హాజరైన రైతులు(ఫైల్)



- దిగుమతి సుంకం శాతాన్ని పెంచిన కేంద్రం
- పెరగనున్న పామాయిల్ గెలల ధర
- ఉమ్మడి జిల్లాలో సాగు విస్తీర్ణానికి ప్రోత్సాహం
- నియోజకవర్గాల వారీగా రైతులకు అవగాహన సదస్సులు
- నల్లగొండ, సూర్యాపేట జిల్లాల మధ్యలో ఫ్యాక్టరీ ఏర్పాటుకు సన్నాహాలు

నల్లగొండ, సెప్టెంబరు 15: వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతున్నాయి. రైతులను ఆయిల్‌పామ్ సాగువైపు పూర్తిగా మళ్లించేలా కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ముడి పామాయిల్ దిగుమతి సుంకాన్ని పెంచుతూ నిర్ణయాన్ని తీసుకొంది. ఈ మేరకు దిగుమతి సుంకాన్ని 5.5శాతం నుంచి ఏకంగా 27.5శాతానికి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం టన్ను ఆయిల్‌పామ్ గెలల ధర రూ.14,392 ఉండగా అది టన్నుకు రూ.1500 నుంచి రూ.1700వరకు అదనంగా పెరిగే అవకాశాలున్నాయి. ఆయిల్ పామ్ గెలల ధర టన్నుకు రూ.16,500కు పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఇప్పుడిప్పుడే నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో ఊపందుకుంటున్న ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులకు కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయంతో మంచి భవిష్యత్తు ఉండే అవకాశాలున్నాయి. గత ఏడాది నుంచి ప్రారంభమైన యాదాద్రి భువనగిరి జిల్లాలో సైతం నాలుగైదు ఏళ్లలో దిగబడులు రానున్నాయి. మొదటి స్థానంలో నల్లగొండ జిల్లా, రెండో స్థానంలో సూర్యాపేట జిల్లాలు, మూడో స్థానంలో యాదాద్రి భువనగిరి జిల్లా ఆయిల్‌పామ్ విస్తీర్ణం ఉంది. కొద్ది రోజుల వరకు ఆయిల్‌పామ్ దిగుబడిపై సుంకం ఎత్తివేయడంతో గెలల ధర తగ్గడంతో రైతుల్లో నిరాశ నెలకొనడంతో పాటు ఈ పంట సాగు చేయాలన్నా ఆసక్తి ఉన్న రైతులపై ప్రభావం చూపినట్లు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో రైతులకు అధిక ధర అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు దిగుమతి చేస్తున్న ముడి పామాయిల్‌పై సుంకం శాతం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయడంతో కేంద్రం స్పందించి సుంకం శాతం పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయిల్ పామ్ రైతులకు భరోసా కలిగింది.

ఉమ్మడి జిల్లాలో 17వేల ఎకరాలకు పైగా సాగు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 17,500 ఎకరాల్లో ఆయిల్‌పాం తోటలు సాగవుతున్నాయి. నల్లగొండ జిల్లాలో 10వేల ఎకరాల్లో, సూర్యాపేట జిల్లాలో నాలుగు వేల ఎకరాలు, యాదాద్రి భువనగిరి జిల్లాలో 3500ఎకరాల్లో ఆయిల్‌పాం సాగవుతోంది. నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో నాలుగేళ్ల క్రితం సాగుచేసిన 1500ఎకరాల ఆయిల్‌పామ్ తోటల నుంచి దిగుబడి మొదలైంది. దీం తో ఉత్పత్తి అవుతున్న మూడు వేల టన్నులను విజయవాడ సమీపంలోని అంపాపురం ఫ్యాక్టరీకి పతాంజలి కంపెనీ నిర్వాహకులు తీసుకెళ్తున్నారు. ఉత్పత్తులు భవిష్యత్తులో పెరిగే అవకాశాలు ఉన్న నేపథ్యంలో పతాంజలి కంపెనీ నల్లగొండ, సూర్యాపేట జిల్లాల మధ్య జాతీయ రహదారి వెంట సుమారు 200ఎకరాల్లో ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడానికి నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ ఏడాది చివరి నాటికి లేదంటే వచ్చే ఏడాది మార్చి వరకు ఫ్యాక్టరీ ఏర్పా టు చేయాలని సన్నాహాలు చేస్తున్నారు. ఈ రెండు జిల్లాల మధ్య ఫ్యాక్టరీ ఏర్పాటైతే ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రైతులతో పాటు సరిహద్దు జిల్లాల రైతులకు కూడా ఈ ఫ్యాక్టరీ అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి. ఫ్యాక్టరీ ఏర్పాటు ద్వారా ఆయిల్‌పామ్ ఉత్పత్తులను క్రషింగ్ చేయడంతో పాటు రాజేంద్రనగర్ వంటి వ్యవసాయ క్షేత్రం మాదిరిగా రైతులకు అవగాహన కల్పించడం కోసం ప్రత్యేకంగా శిక్షణ తరగతులను నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఆ కంపెనీ ఆవరణలో సైతం 50 ఎకరాల వరకు ఆయిల్‌పామ్ సాగును చేసి రైతుల ఆసక్తి పెంచడం కోసం నిర్ణయించినట్లు తెలిసింది. కేంద్రం నిర్ణయం ప్రకారం జిల్లాలో అధికార యంత్రాంగం కూడా ఆయిల్‌పాంసాగు పెంచాలని ప్రణాళిక రూపొందిస్తోంది. నల్లగొండ జిల్లాలో ఈ ఏడాది లక్ష్యం ఐదు వేల ఎకరాల వరకు ఉంది. అదేవిధంగా సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలో కూడా ఆయిల్‌పాం సాగును విస్తరించేందుకు ఆయా కంపెనీలు సిబ్బంది సంఖ్యను పెంచి ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించారు.

నియోజకవర్గాల వారీగా అవగాహన సదస్సులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్‌పామ్ సాగు తోటల పెంపుపై దృష్టిసారించిన నేపథ్యంలో పంటల సాగును విస్తరింపచేయడంతో పాటు రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. నల్లగొండ జిల్లాలో ఇప్పటికే నియోజకవర్గాల వారీగా సదస్సులు మొదలయ్యాయి. ఈ సదస్సు లకు ఉద్యాన శాఖ అధికారులతో పాటు ఆయిల్‌పాం కంపెనీల ప్రతినిధుల, ఇతర అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు హాజరవుతున్నారు. ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంచేందుకు ఇప్పటికే పెద్దఎత్తున సబ్సిడీలు ఇస్తున్న విషయం తెలిసిందే. సబ్సిడీలు ఇవ్వడం ద్వారా రైతులను సాగుపట్ల ఆసక్తిని కల్పించాలని ప్రభుత్వం యోచిస్తుంది. వరికి బదులు పామాయిల్ సాగు చేస్తే మేలు కలుగుతుందనేది ప్రభుత్వం యోచిస్తూ అందుకు అనుగుణంగా ప్రోత్సాహకాలను అందిస్తుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆయిల్ పామ్ సాగు ప్రోత్సాహకం విస్తీర్ణంపై ప్రత్యేక దృష్టి సారించి రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడం కోసం ప్రభుత్వం పలు మార్గాలను అన్వేషిస్తుంది. రైతులకు అధిక ధరలను అందించి ఆయిల్‌పామ్ సాగును లాభసాటిగా చేసి కొత్త రైతులను ప్రభుత్వాలు ప్రోత్సహిస్తు న్నాయి. అవగాహన సదస్సుల్లో పెట్టుబడుల విషయంతో పాటు భూమిలోని మట్టి స్థితిగతులు వాడాల్సిన ఎరువులు, నీటి వనరులు ఇంకా ఇతర అంశాలన్నింటినీ రైతులకు సవివరంగా తెలియజేస్తూ అవగాహన సదస్సులు కొనసాగిస్తున్నారు. వచ్చే రోజుల్లో మండలాల వారీగా కూడా సదస్సులు కూడా ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. నల్లగొండ జిల్లాలో ఇప్పటికే 10వేల ఎకరాల్లో విస్తీర్ణం ఉండగా మరో ఐదు వేల ఎకరాల్లో విస్తీర్ణం పెంచనున్నారు. సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలో కూడా తోటల విస్తీర్ణాన్ని పెంచడం మూలంగా రాబోయే రోజుల్లో ఆయిల్ పామ్ రైతులకు మహార్దశ చేకూరనుంది.

ఆయిల్‌పాం రైతులకు ప్రోత్సాహం



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్‌పామ్ రైతులను ప్రోత్సహిస్తుండడంతో జిల్లాలో పెద్ద ఎత్తున ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం కానుంది. నల్లగొండ జిల్లాలో ఇప్పటికే నియోజకవర్గాల వారీగా ఆయిల్ పాంపై రైతులకు అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని పెంచడంతో ఆయిల్‌పామ్ గెలల ధరలు పెరిగాయి. త్వరలో ఫ్యాక్టరీ కూడా ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఫ్యాక్టరీ ఏర్పాటైతే రైతులకు ఎంతగానో ఉపయోగం కానుంది.

\- వీవీఎస్ సాయిబాబా, డిప్యూటీ డైరెక్టర్ ఉద్యానశాఖ నల్లగొండ.

యువతి అనుమానాస్పద మృతి

● మృతదేహంతో కుటుంబ సభ్యుల నిరసన ● హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆందోళన

దామరచర్ల, సెప్టెంబరు 15: నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం పుట్టలగడ్డతండా శివారులో ఓ యువతి అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. గ్రామ శివారులో ఓ చెట్టుకు యువతి ఉరివేసుకుని ఉండగా, హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని యువతి బంధువులు ఆందోళనకు దిగారు. బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దామరచర్ల మండలం మాన్‌తండాకు చెందిన భూక్యా మౌనిక(20) హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ క్రమంలో మండలంలోని పుట్టలగడ్డతండా చెందిన రూపావత్ నాగునాయక్‌తో మూడేళ్ల క్రితం హైదరాబాద్‌లో పరిచయం ఏర్పడింది. కళాశాలకు సెలవులు ఉండడంతో నాగునాయక్‌తో కలిసి మౌనిక హైదరాబాద్ నుంచి శనివారం సాయంత్రం పుట్టలగడ్డతండాకు వచ్చింది. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం గ్రామ శివారులోని వేప చెట్టుకు వేలాడుతున్న మౌనిక మృతదేహాన్ని స్థానిక రైతులు గుర్తించి గ్రామస్థులు, పోలీసులకు సమాచారం అందించారు. మౌనిక కుటుంబసభ్యులు అక్కడికి చేరుకుని ఆందోళన చేశారు. మౌనిక మృతికి రూపావత్ నాగునాయక్ కారణమని ఆరోపిస్తూ బొత్తలపాలెం వద్ద నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై మృతదేహంతో రాస్తారోకో చేశారు. మౌనికను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పోలీసులు వారికి నచ్చజెప్పి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. యువతి మృతికి ప్రేమ వ్యవహారమే కారణమని పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. హైదరాబాద్‌లో ఉంటున్న నాగునాయక్ శనివారం సాయంత్రం మౌనికను హైదరాబాద్ నుంచి తన ఇంటికి తీసుకెళ్లి కుటుంబసభ్యులతో కలిసి పథకం ప్రకారం హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని యువతి కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. నాగునాయక్‌తోపాటు కారకులైన అతని కుటుంబసభ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మౌనిక మృతికి కారకుడిగా అనుమానిస్తున్న నాగునాయక్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. యువతి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరబాబు తెలిపారు.

తల్లిదండ్రులతో గొడవ పడి..


మిర్యాలగూడ అర్బన్, సెప్టెంబరు 15: తల్లిదండ్రులతో గొడవపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణం తాళ్లగడ్డకు చెందిన గొడుగు మహేష్(23) పట్టణంలో బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 10న ఇంటికి వచ్చిన మహేష్ తల్లిదండ్రులతో ఘర్షణ పడి మనస్తాపంతో ఇంటినుంచి బయటకు వెళ్లాడు. తల్లిదండ్రులు తన కుమారుడి ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో రెండు రోజుల క్రితం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కాగా మహేష్ అదేరోజు రాత్రి టీఎస్ 05ఎఎఫ్ 2621 నెంబరుగల తన స్కూటీపై అవంతీపురం అటవీప్రాంతంలోకి వెళ్లి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఆదివారం అటవీ ప్రాంతంలోకి వెళ్లిన పాశువుల కాపరులు చెట్టుకు వేలాడుతూ కుళ్లిపోయిన దశలో ఉన్న మృతదేహాన్ని గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పక్కనే ఉన్న స్కూటీ నెంబర్ ఆధారంగా మృతుడు తాళ్లగడ్డకు చెందిన యువకుడిగా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మహేష్ తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఏఎస్‌ఐ రాములునాయక్ తెలిపారు.

బాలుడిని చిదిమేసిన లారీ


అబుబాకర్ సిద్దిఖీ(ఫైల్)

నాగారం, సెప్టెంబరు 14: పాఠశాలకు సెలవులు రావడంతో అమ్మమ్మ ఊరికి వచ్చిన బాలుడిని లారీ మృత్యు రూపంలో కబళించింది. బంధువుల ఇంటికి వెళ్లి ఆడుకొని తన ఇంటికి వస్తుండగా చిదిమేసింది. ఈ హృదయ విదారక సంఘటన సూర్యాపేట జిల్లా నాగారం మండలంలోని ఫణిగిరి స్టేజీ సమీపంలో ఆదివారం జరిగింది. ఎస్‌ఐ ఎం. ఐలయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఎండీ. అశరఫ్ ఉపాధి కోసం దుబాయ్‌కు వెళ్లాడు. ఈ క్రమంలో అబుబాకర్ సిద్దిఖీ(8) తన తల్లి నసీమా బేగంతో కలిసి రెండేళ్లుగా నల్లగొండ పట్టణంలో అమ్మమ్మ, తాత వద్ద ఉంటున్నాడు. ఓ ప్రైవేట్ స్కూల్‌లో రెండో తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు మూడు రోజుల పాటు సెలవులు రావడంతో అమ్మమ్మ తాతతో కలిసి శనివారం సొంతూరు సుర్యాపేట జిల్లా నాగారం మండలం ఫణిగిరి గ్రామానికి వచ్చారు. ఆదివారం ఫణిగిరి స్టేజీ వద్ద ఉన్న అమ్మమ్మ నివాసం నుంచి ఆడుకోవడానికి అబుబాకర్ రోడ్డుకు అవతలి వైపున ఉన్న వారి బంధువు ఇంటికి వెళ్లాడు. అక్కడి నుంచి సాయంత్రం ఐదు గంటల సమయంలో బాలుడు తిరిగి తన అమ్మమ్మ ఇంటికి వస్తుండగా సుర్యాపేట- జనగాం నేషనల్ హైవే రోడ్డు దాటుతున్న సమయంలో సుర్యాపేట నుంచి జనగాం వైపు వెళుతున్న సిమెంట్ బ్రిక్స్ లోడుతో వేగంగా వెళుతున్న (టీఎస్ యూబీ 1278)నెంబర్ గల లారీ తగిలి బాలుడు వెనుక టైరు కింద పడ్డాడు. అబుబాకర్ తలపై నుంచి లారీ టైరు వెళ్లడంతో తల ఛిద్రమై అక్కడికక్కడే మృతిచెందాడు. బాలుడి మరణవార్త విని సంఘటనా స్థలానికి చేరుకున్న తల్లి నసీమా బేగం సొమ్మసిల్లి పడిపోయింది. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ ఐలయ్య సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాలుడి తల్లి నసీమా బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో తల్లి నసీమా బేగం, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.

నిండుకుండలా సాగర్ ప్రాజెక్టు


నాలుగు గేట్ల ద్వారా విడులవుతున్న నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీరు

నాగార్జునసాగర్, కేతేపల్లి, మేళ్లచెర్వు, సెప్టెంబరు 14: నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద రాక కొనసాగుతోంది. దీంతో ఆదివారం నాలుగు క్రస్ట్‌గేట్లను ఐదు అడుగుల మేరకు ఎత్తి దిగువకు నీటి విడుదల చేస్తున్నారు. ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 67,194క్యూసెక్కుల వరద సాగర్‌కు వచ్చి చేరుతోంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 590అడుగులు(312.0450 టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 10వేల క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 4,679క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 28,048 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని, మొత్తం 26క్రస్ట్ గేట్లలో నాలుగు క్రస్ట్‌గేట్లను ఐదు అడుగుల మేరకు ఎత్తి 32,400 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్‌నుంచి మొత్తం 78,427 నీరు విడుదలవుతుండగా, ఎగువనుంచి 67,194క్యూసెక్కుల నీరువచ్చి చేరుతోంది.

మూసీ రిజర్వాయర్‌కు జలకళ

మూసీ రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరి నీటితో నిండుకుండలా మారింది. 645అడుగుల పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టు అక్టోబర్, నవంబర్ మాసాల్లో వచ్చే తుపాన్లు, ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో కురిసే వర్షాలకు నిండడం, రబీలో ఆయకట్టుకు సాగునీటిని వదలడం ఆనవాయితీ. ఎగువ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో క్రమం తప్పకుండా వస్తున్న ఇన్‌ఫ్లోతో ప్రాజెక్టు నీటిమట్టం ఒక్కో అడుగు చొప్పున పెరుగుతూ వచ్చి ఆదివారం సాయంత్రానికి 644.18అడుగులకు చేరింది. 4.46 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టులో ప్రస్తుతం 4.25 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 786.22క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు కూడా సాగునీటి విడుదల కొనసాగుతోంది. కుడికాల్వకు 315.90క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 315.90క్యూసెక్కుల చొప్పున ఆయకట్టుకు రెండో విడతగా నీటిని విడుదల చేస్తున్నారు.

రెండు గేట్ల ద్వారా పులిచింతల నీరు విడుదల

ఉభయ తెలుగు రాష్ట్రాల సరిహద్దులో గల పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి స్వల్పంగా వరద ప్రవాహం కొనసాగుతుండడంతో రెండు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు(45.77టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 174అడుగులు(44.23 టీఎంసీలుగా) నమోదైంది. ప్రాజెక్టుకు ఎగువ నుంచి 49,570 క్యూసెక్కుల నీరు వస్తుండగా, రెండు గేట్ల ద్వారా 34,974 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం నుంచి 16 వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ నాలుగు యూనిట్ల ద్వారా 104మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. ఔట్‌ఫ్లో 50,974 క్యూసెక్కులుగా నమోదైంది.

కోదాడలో వ్యాపారుల పరస్పర దాడులు

కోదాడటౌన్, సెప్టెంబరు 15: సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో రాజస్థాన్ వ్యాపారులు ఆదివారం కర్రలతో పరస్పరం దాడులు చేసుకున్నారు. కోదాడకు చెందిన వ్యాపారులు హైదరాబాద్ రాజస్థాన్ వ్యాపారులు వద్ద సరుకులు తెచ్చుకున్నారు. వారి మధ్య సరుకులకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో కోదాడ వ్యాపారులు నగదు చెల్లించకపోవడంతో హైదరాబాద్‌కు చెందిన వ్యాపారులు వాహనంలో వచ్చి కర్రలతో కోదాడ వాసులపై దాడి చేసేందుకు యత్నించారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. స్థానికులు చేసుకొని ఇరువర్గాలకు సర్ది చెప్పారు.

తెలంగాణ కోసం జీవితం త్యాగం చేసిన 'జిట్టా'

భువనగిరి టౌన్, సెప్టెంబరు 15: తెలంగాణ సాధన కోసం జీవితాన్ని త్యాగం చేసిన జిట్టా బాలకృష్ణారెడ్డి ప్రజల హృదయాలను గెలుచుకున్న నేత అని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రంలో ఆదివారం నిర్వహించిన జిట్టా బాలకృష్ణారెడ్డి సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణ కళారూపాలు, వంటకాల, తెలంగాణకు జరిగిన అన్యాయంపై కళాకారుల ప్రదర్శనలతో ఆయన తెలంగాణ ఉద్యమానికి నూతన రూపం ఇచ్చాడన్నారు. రాష్ట్ర సాధన కోసం సొంత నిధులను వెచ్చించి చివరికి ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. భువనగిరిగి ఎమ్మెల్యేగా రెండు సార్లు స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసిన స్వల్ప తేడాతో ఓడినప్పటికీ ఆయనకు రాజకీయంగా అన్యాయం జరిగిందన్నారు. చారిత్రాత్మక భువనగిరి ఖిల్లాకు లక్షల రూపాయల వ్యయంతో లైట్లు వేసి ఖిల్లా వైభవాన్ని ప్రపంచానికి చాటిన ఘనత ఆయనదేనన్నారు. ప్రజల సంక్షేమం కోసం జీవితాన్ని త్యాగం చేసిన జిట్టా కుటుంబానికి అందరము అండగా ఉండాలన్నారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలను ఫ్లోరైడ్ రక్కసి నుంచి కాపాడేందుకు 20 ఏళ్ల క్రితమే కోట్లాది రూపాయల వ్యయంతో 150కి పైగా వాటర్ ఫిల్టర్లను ఏర్పాటు చేసిన గొప్ప నేత అని కొనియాడారు. ప్రభుత్వాలు చేయలేని పనులను ఆయన చేసి చూపించారన్నారు. ప్రజల మనసుల్లో నిలిచిన జిట్టా బాలకృష్ణారెడ్డి క్యాంస్య విగ్రహాన్ని భువనగిరిలో త్వరలో ప్రతిష్టిస్తామని తెలిపారు. జిట్టాపై ప్రముఖ కళాకారుడు ఏపూరి సోమన్న రాసి పాడిన పాటల సీడీ ఆయన విడుదల చేశారు.

జిట్టా కుటుంబాన్ని పరామర్శించిన కేటీఆర్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ జిట్టా బాలకృష్ణారెడ్డి కుటుంబాన్ని పరామర్శించి నివాళులర్పించారు. అలాగే ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, జిట్టా ఫాంహౌజ్‌లో కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మాజీ మంత్రులు జి జగదీష్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎండి మహమూద్ అలీ, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి, నోముల భగత్, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, గాదరి కిషోర్, తెలంగాణ ఉద్యమ నేత చెరుకు సుధాకర్, దాసోజు శ్రవణ్‌కుమార్, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, ఉమాదేవి, మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, తదితరులు నివాళులర్పించి జిట్టా కుటుంబాన్ని పరామర్శించారు.


జిట్టా బాలకృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కేటీఆర్, బీఆర్ఎస్ నాయకులు

నత్తనడకన రైల్వే అండర్ పాస్

● వర్షం పడితే డైవర్షన్ రోడ్డులో ప్రయాణికుల అవస్థలు

రైల్వే అండర్ పాస్ నిర్మాణాన్ని సాధారణంగా మూడు నెలల్లో పూర్తి చేస్తారు. బాగా ఆలస్యమైతే సంవత్సర కాలం పడుతుంది. అయితే ఎనిమిది సంవత్సరాల క్రితం ప్రారంభించిన అండర్ పాస్ నిర్మాణం నత్త నడకన కొనసాగుతోంది. అండర్‌పాస్ నిర్మించేందుకు అర కిలోమీటర్ దూరం డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేశారు. వర్షం పడితే ఈ డైవర్షన్ రోడ్డు బురదమయంగా మారుతోంది. వానాకాలంలో ఈ రోడ్డులో రాకపోకలు సాగించడానికి వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

● మేళ్లచెర్వు

మేళ్లచెర్వు, చింతలపాలెం మండలాల మధ్య రైల్వే వంతెనను నిర్మించాల్సి ఉంది. అయితే ఈ ప్రాంతంలో అండర్ పాస్ బ్రిడ్జిని 2015లో ప్రారంభించారు. అప్పటి నుంచి అండర్ పాస్ బ్రిడ్జి నుంచి వేపలమాధారం రోడ్డు వరకు అర కిలోమీటర్ వరకు డైవర్షన్ రోడ్డును ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో సున్నపు రాయి గని ఉండటంతో తవ్వకం ప్రధాన సమస్యగా మారింది. మొదట బ్లాస్టింగ్ చేసి మేళ్లచెర్వు వైపు తవ్వగా, బ్లాస్టింగ్‌లో తమ ఇళ్లు దెబ్బతింటున్నాయని రెండో వైపు చింతలపాలెం రోడ్డు పక్కన ఉన్న ఇళ్ల యజమానులు కోర్టును ఆశ్రయించారు. దీంతో బ్లాస్టింగ్‌ను ఆపేసి, ఎక్స్‌కవేటర్‌తో తవ్వడంతో పనులు ఆలస్యమయ్యాయి. వర్షం పడితే డైవర్షన్ రోడ్డు బురదమయంగా మారడంతో రాకపోకలకు ప్రయాణికులు, విద్యార్థులు, రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ డైవర్షన్ రోడ్డు తమ పరిధిలోకి రాదని ఆర్‌అండ్‌బీ అధికారులు చెబుతుండగా, తమకు సంబంధం లేనట్లుగా రైల్వే అధికారులు వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డులోని కొంత భాగంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో సీసీ రోడ్డు నిర్మించారు. మిగిలిన భాగం ప్రమాదకరంగా ఉంది.



అండర్ పాస్ డైవర్షన్ రోడ్డులో కూరుకుపోయిన లారీ



అండర్ పాస్ నిర్మాణంలోకి పూర్తిగా చేరిన వరద నీరు

అండర్ పాస్ మునిగే ప్రమాదం

అండర్ పాస్ బ్రిడ్జి భూమి నుంచి 20మీటర్ల లోతులో ఉండటం, రెండు వైపులా వాలుగా ఉండటంతో వర్షపు నీరు అండర్ గ్రౌండ్ మధ్యలోకి చేరుతోంది. ఆ నీటిని మళ్లించేందుకు అండర్ పాస్‌కు సమాంతరంగా రైల్వే ట్రాక్ పక్కన కాలువ తవ్వినప్పటికీ కాల్వ పూడితే, అండర్ పాస్ మొత్తం మునిగే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు.



డైవర్షన్ రోడ్డులో నీరు, బురదతో అవస్థలు పడుతున్న ప్రయాణికులు

చుట్టూ తిరిగి వెళ్లాలంటే గంట సమయం పడుతోంది



బ్రిడ్జి నిర్మాణానికి ముందు అరక, పశువులు తోలుకు వెళితే 10నిమిషాలు పట్టేది. ఇప్పుడు చుట్టూ తిరిగి గుంతలమయమైన రోడ్డులో వెళ్లడానికి గంట సమయం పడుతోంది. బురదకు పశువులు కాలు జారి కిందపడుతున్నాయి. బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి. లేనిపక్షంలో మిగిలిన భాగంలో సీసీ రోడ్డును పూర్తి చేయాలి.

●సింగతల కొండారెడ్డి, రైతు

అనుమతివస్తే రెండు నెలల్లో పూర్తి చేస్తాం

రైల్వే శాఖ నుంచి నుంచి అనుమతి వస్తే రెండు నెలల్లో బ్రిడ్జి నిర్మాణం పూర్తవుతుంది. కొందరు గ్రామస్థులు కోర్టుకు వెళ్లటంతో నిర్మాణ పనులు ఆలస్యమయ్యాయి. రైల్వే ట్రాక్‌కు రెండువైపులా అండర్ గ్రౌండ్ పూర్తయింది. రైల్వే అధికారులు అనుమతి ఇస్తే రైల్వే ట్రాక్ కింద సొరంగం తవ్వి, ఇప్పటికే రూపొందించిన ఆర్చ్‌లను రైల్వే ట్రాక్ కింద అమర్చితే నిర్మాణం పూర్తవుతుంది.

● గోలి శంభయ్య, సైట్ ఇన్‌చార్జి

విద్యుత్‌ను సక్రమంగా అందించాలి



మామిళ్లగూడెం సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న వివిధ గ్రామాల రైతులు

మోతె, సెప్టెంబరు 15: విద్యుత్‌ను సక్రమంగా అందించనందున పంటలు ఎండిపోతున్నాయని మండలంలోని మామిళ్లగూడెం, హుస్సేనాబాద్, కొత్తగూడెం, తుమ్మలపల్లి గ్రామాల రైతులు తెలిపారు. ఈ మేరకు మండలంలోని మామిళ్లగూడెం సబ్‌స్టేషన్ ఎదుట ఆదివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మామిళ్లగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో త్రీఫేజ్ విద్యుత్‌ను సక్రమంగా ఇవ్వనందున మిరప తోటలు, వరి పైర్లు ఎండిపోతున్నాయని తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ ఏఈ, సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లినా స్పందనలేదని రైతులు వాపోయారు. ఏఈ శాంతి వచ్చి నచ్చజెప్పినా రైతులు వినకపోవడంతో మరో సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ త్రీఫేజ్‌ను ఇవ్వడంతో ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో రైతులు వెంకన్న, సుధాకర్, శేషిరెడ్డి, బాబు, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

అభయ్ పాటిల్‌కు ఘన స్వాగతం

భానుపురి, సెప్టెంబరు 15: బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి అభయ్ పాటిల్‌కు ఆదివారం జిల్లాకేంద్రంలో ఘన స్వాగతం పలికారు. ఖమ్మం నుంచి హైదరాబాద్ వెళ్తూ మధ్యలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు ఇంటి వద్ద కాసేపు ఆగారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు మధుసూధన్‌రెడ్డి, సంకినేని వరుణ్‌రావు, పల్సా మల్సూర్, సలిగంటి వీరేంద్ర, మంగ్యానాయక్ తదితరులు ఉన్నారు.

'సాయుధ పోరాటానికి వారసులు కమ్యూనిస్టులే'

మోతె, సెప్టెంబరు 15: తెలంగాణ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మట్టిపెల్లి సైదులు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటాల వారోత్సవాల సందర్భంగా ఆదివారం మండలంలోని రాఘవాపురం క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సాయుధ పోరాట చరిత్రను బీఆర్ఎస్, బీజేపీలు వక్రీకరిస్తున్నాయన్నారు. అనంతరం సాయుధ పోరాట అమరుడు బత్తిని పెంటయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గోపాల్‌రెడ్డి, ఏసు, పోతయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

ఈ నెల 17వ తేదీ విద్రోహ దినం: ఐఎఫ్‌టీయూ

ఆత్మకూర్(ఎస్) సెప్టెంబరు 15: ఈనెల 17వ తేదీ ముమ్మాటికీ విద్రోహ దినమని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో మృతిచెందిన అమరవీరుల స్థూపాల వద్ద ఆదివారం మండల కేంద్రంతో పాటు మండలంలోని తుమ్మలపెన్‌పహాడ్ గ్రామంలో నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు అలుగుబెల్లి వెంకటరెడ్డి, సామ నర్సిరెడ్డి, కంచర్ల నర్సమ్మ, డేగల వెంకటకృష్ణ, దశరథ, ఏల్లయ్య పాల్గొన్నారు.

ప్రవీణ్‌కుమార్ మృతి బాధాకరం

● ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్‌గౌడ్

ఆత్మకూర్(ఎస్), సెప్టెంబరు 15: ప్రవీణ్‌కుమార్ మృతి బాధాకరమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్‌గౌడ్ అన్నారు. ఇటీవల అమెరికాలో స్విమ్మింగ్‌పూల్‌లో ప్రమాదవశాత్తు పడి మండలంలోనిపాతర్లపహాడ్ గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్ మృతి చెందాడు. ఆదివారం పాతర్లపహాడ్‌లో ప్రవీణ్‌కుమార్ చిత్రపటానికి సిద్ధార్థ కళాశాల పూర్వ స్నేహితులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించి మాటాడారు. ఒక మంచి స్నేహితుడ్ని కోల్పోవడం చాలా బాధగా ఉందన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు మెంచు శ్రీనివాస్, సీఐ వీరభద్రం, నాగేశ్వరావు, ఆకుల సుమన్, నగేష్, సంజీవరెడ్డి, యాకయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, కిశోర్, రాకేష్, చంద్రశేఖర్, నవీన్, సుధీర్, కార్తీక్, నాగరాజు, భాస్కర్, రవీందర్‌రెడ్డి, శ్రావణ్, యాదగిరి, నటేష్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరాలి: రామచంద్రయ్య

తిరుమలగిరి రూరల్: సెప్టెంబరు 15: ప్రజలు బీజేపీలో చేరి దేశ అభివృద్ధికి తోడ్పాటు నందించాలని బీజేపీ తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కడియం రామచంద్రయ్య అన్నారు. మండలంలోని మామిడాల గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బొల్లు మల్లయ్య, నీలపు లింగయ్యపాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

కోదాడ రూరల్, సెప్టెంబరు 15: మండలంలోని కూచిపూడి గ్రామంలో వరద బాధిత కుటుంబాలకు సర్వేజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు 50కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్ర బండారు కవిత, అమరేందర్‌రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

బీసీలకు సామాజిక న్యాయం జరగాలి


పాలకవీడు, సెప్టెంబరు 15: బీసీలకు సామాజిక న్యాయం జరగాలని రాష్ట్ర నాయకుడు ధూళిపాల ధనుంజయనాయుడు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. దేశ జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం న్యాయం చేయలేదని, ఓట్లు వేసే యంత్రాలుగానే బీసీలను చూస్తున్నాయని విమర్శించారు. జనగణనలో కులగణనను బీజేపీ ఎందుకు వ్యతిరేకిస్తుందో ప్రజలకు తెలియజేయాలన్నారు.

'కమిటీని ఉపసంహరించుకోవాలి'

సూర్యాపేటటౌన్, సెప్టెంబరు 15: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అమలుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీని ఉపసంహరించుకోవాలని మాల మహానాడు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకుడు ఎర్రమల్ల రాములు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మాల కులస్థులకు అన్యాయం చేసేలా మంత్రులతో కమిటీ వేయడం, దానికి చైర్మన్‌గా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని నియమించడం దారుణమన్నారు. కమిటీలో మాల మంత్రులను ఎందుకు నియమించలేదని ప్రశ్నించారు. సమావేశంలో కట్ట సైదులు, కట్ల మురళి, జంగం కరుణాకర్, నాగయ్య పాల్గొన్నారు.

ఇటొచ్చి ప్రమాదం బారిన పడొద్దు

● బోర్డు ఏర్పాటు చేసిన పోలీసులు



క్వారీ ప్రాంతంలో పోలీసులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

ఆత్మకూర్(ఎస్) మండలంలోని బొప్పారం గ్రామంలో పాల్వంచ, కొత్తగూడెం ప్రాంతానికి చెందిన కాంట్రాక్టర్ వీరునాయక్ పదేళ్ల క్రితం భూమిని కొనుగోలు చేసి క్వారీ కోసం లీజుకు తీసుకున్నాడు. కోట్లాది రూపాయల విలువైన గ్రానైట్ రాయిని తవ్వి తీసి విక్రయించిన వీరునాయక్ గుంతలను పూడ్చకుండా మూడేళ్ల క్రితం వదిలి వెళ్లాడు. వర్షాలకు ఈ గుంతల్లో భారీగా నీరు చేరడంతో ఈతకు దిగి ముగ్గురు, మోటారు తీయడానికి వెళ్లి కూలీ ఒకరు ఇప్పటికే ప్రాణాలు కోల్పోయారు. క్వారీ గుంత నుంచి కూలీ మృతదేహాన్ని వెలికి తీయడానికి పోలీసులు, అగ్నిమాపక అధికారులు రెండు రోజులు కష్టపడ్డారు. అదే విధంగా ఈ క్వారీ గుంతలో పడి పలు మూగ జీవాలు మృత్యువాతపడ్డాయి. అధికారులు నోటీసులు జారీ చేసినా కాంట్రాక్టర్ స్పందించడంలేదు. కాంట్రాక్టర్‌పై పోలీసులు మైనింగ్ శాఖ అధికారుకు పలు మార్లు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. కనీసం క్వారీ లీజు రద్దు చేసి గుంతలు పూడ్చే ప్రయత్నం కూడా చేయలేదు. . క్వారీ చుట్టూ పోలీసులు ముళ్ల కంప వేయడంతో పాటు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

● ఆత్మకూర్(ఎస్)

ప్రజాసమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం



సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ పార్టీలో చేరుతున్నవారికి కండువాలు కప్పుతున్న కొత్తపల్లి శివకుమార్

సూర్యాపేటటౌన్, సెప్టెంబరు 15: ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రధాన లక్ష్యమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్‌లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్‌లో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. నిరుపేదలు, ఇళ్లు లేని వారికి రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాస్‌లైన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కుడకుడలోని ప్రభుత్వ భూమిలో నిరుపేదలు గుడిసెలు వేసుకుంటే కొంతమంది నాయకులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీని, బీఆర్ఎస్ నాయకులను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రతి ఒక్కరికీ తీవ్ర అన్యాయం జరిగిందని, ప్రశ్నించే గొంతుకలను అణిచివేస్తూ, అక్రమ కేసులు బనాయించిందని మండిపడ్డారు. పేదలకు మాస్‌లైన్ పార్టీతో న్యాయం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ మాస్ లైన్ పార్టీతో కలిసి నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో కారింగుల వెంకన్న, కొత్తపల్లి రేణుక, ఎర్ర అఖిల్‌కుమార్, పేర్ల నాగయ్య, గొడ్డలి నర్సయ్య, సయ్యద్, పిడమర్తి లింగయ్య, రామోజీ, చిత్తలూరు లింగయ్య, జక్కుల శేషగిరి, వెంకన్న, సైదులు, ఆనంద్, వెంకన్న, బండ్ల రేణుక, పున్నమ్మ, రాజేశ్వరి, పరశురాం, రమేష్, సరస్వతి, అర్జున్, వాణి, నాగభూషణం, మేరమ్మ, యాకమ్మ, మాలతి, వెంకన్న పాల్గొన్నారు.

ఏచూరి మృతి కమ్యూనిస్టులకు తీరని లోటు

సూర్యాపేట రూరల్, సెప్టెంబరు 15: సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి కమ్యూనిస్టులకు తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు చెరుకు ఏకలక్ష్మి అన్నారు. ఆదివారం మండలంలోని రామచంద్రపురం గ్రామంలో సీపీఎం గ్రామశాఖ ఆధ్వర్యంలో ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి మారం చంద్రారెడ్డి, సత్తయ్య, చెరుకు సత్యం, పొదిల అంజయ్య, భిక్షం, మల్లేష్, అంజయ్య. వెంకన్న పాల్గొన్నారు.

తిరుమలగిరి రూరల్: సీతారాం ఏచూరి మృతితో భారతదేశం ఒక మంచి విజ్ఞత కలిగిన మహోన్నతుడిని కోల్పోయిందని రైతు సంఘం జిల్లా నాయకుడు కదారి లింగయ్య అన్నారు. మండలంలోని వెలిశాల గ్రామంలో ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దూపటి రాములు, చిత్తలూరి సోమయ్య, లింగయ్య, నర్సయ్య, ఏపూరి రాములు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు గురుకుల విద్యార్థి ఎంపిక

చివ్వెంల, సెప్టెంబరు 15: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 13వ తేదీన జరిగిన జిల్లా స్థాయి అండర్-14 అథ్లెటిక్స్ పోటీల్లో చివ్వెంల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థి జి.విశాల్ 60మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం, లాంగ్‌జంప్, హైజంప్‌లో ప్రథమ స్థానం సాధించాడు. హైదరాబాద్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీలో ఈనెల 19, 20వ తేదీల్లో నిర్వహించే 10వ తెలంగాణ రాష్ట్ర సౌత్ జోన్ స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో విశాల్ పాల్గొననున్నాడు. విశాల్‌ను కళాశాల ప్రిన్సిపాల్ జీవీ. విద్యాసాగర్, ఉపాధ్యాయులు అభినందించారు.



విశాల్

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నేరేడుచర్ల, సెప్టెంబరు 15: మండలంలోని దిర్శించర్ల గ్రామంలో రూ.5లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చినవెంకట్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రాపోలు నర్సయ్య, వెంకట సైదులు, సైదిరెడ్డి, శ్రీను, నర్సింహ, సైదులు పాల్గొన్నారు.

విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలి



కోదాడలో విద్యుత్ ఏఈ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న కళాశాల ప్రతినిధులు

కోదాడ టౌన్, భానుపురి, సూర్యాపేట టౌన్, సెప్టెంబరు 15: మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఇంజనీరింగ్ విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని కళాశాల చైర్మన్ నీలా సత్యనారాయణ అన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య పుట్టినరోజు సందర్భంగా ఆదివారం కోదాడలోని కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కోదాడ పట్టణ విద్యుత్ ఏఈ మల్లెల శ్రీనివాస్, విద్యుత్ ఎంఆర్టీ ఏఈ పార్వతిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సీహెచ్ నాగార్జునరావు, కళాశాల ప్రిన్సిపాల్ పి.గాంధీ, వివిధ విభాగాధిపతులు నరేష్‌రెడ్డి, ఎజాజ్, స్రవంతి, అధ్యాపకులు అబ్దుల్ మన్నన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● ఇంజనీరింగ్ డే సందర్భంగా సూర్యాపేట వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ విద్యార్థులతో పాటు వివిధ రంగాల్లో రాణిస్తున్న పలువురిని సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. హైదరాబాద్ లయన్స్ క్లబ్ మల్టీచైర్మన్ జగన్మోహన్‌రెడ్డి విద్యార్థులకు అవగాహన కల్పించారు. లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కొండపల్లి లక్ష్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జలీల్, ఉప్పల రాజేంద్రప్రసాద్, పటేల్ నర్సింహారెడ్డి, వెంకటేశ్వర్‌రావు, రవీందర్‌రెడ్డి, మల్లు వెంకటరెడ్డి, చంద్రశేఖర్, లక్ష్మయ్య, నాగేశ్వర్, శ్రీరాములు, పోలెబోయిన నర్సయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

● సమాజాభివృద్ధిలో ఇంజనీర్లది కీలకపాత్ర అని లయన్స్ క్లబ్ సభ్యుడు జగన్మోహన్‌రెడ్డి అన్నారు.ఇంజనీరింగ్‌డేని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఇంజనీర్ మామిళ్లపల్లి ఉష అచ్యుత్‌కుమార్‌తో పాటు పలువురు ఇంజనీర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొండపల్లి లక్ష్మారెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ జలీల్, కోఆర్డినేటర్ ఉప్పల రాజేంద్రప్రసాద్, పటేల్ నర్సింహారెడ్డి, ఆర్పీ జి.వెంకటేశ్వరరావు, రవీందర్‌రెడ్డి, మల్లు వెంకటరెడ్డి, చంద్రశేఖర్, లక్ష్మయ్య, లింగయ్య, నాగేశ్వరరావు, శ్రీరాములు, నర్సయ్యయాదవ్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రతిభావంతులను సన్మానించి సూర్యాపేట ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల నిర్వాహకులు

ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలి



జాజిరెడ్డిగూడెంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మందుల సామేలు

అర్వపల్లి, సెప్టెంబరు 15: ప్రతిఒక్కరూ భక్తి భావాన్ని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. ఆదివారం జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో గణేష్ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో రైతులు, ప్రజలు సంతోషంగా ఉండాలన్నారు. వర్షాలు పడి నియోజకవర్గంలోని చెరువులు, కుంటలు నిండటంతో రైతులు ఆనందంగా ఉన్నారన్నారు. ముందుగా ఎమ్మెల్యేకు గ్రామస్థులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో గుడిపెల్లి మధుకర్‌రెడ్డి, ఇందుర్తి వెంకట్‌రెడ్డి, దాసరి సోమయ్య, నరేష్, కిరణ్, కొమరెల్లి, చింత నర్సయ్య, బింగి కృష్ణమూర్తి, బి.మహారాజు పాల్గొన్నారు.

ప్రశాంతంగా వినాయక శోభాయాత్రను నిర్వహించుకోవాలి

సూర్యాపేట టౌన్: ప్రశాంత వాతావరణంలో వినాయక శోభాయాత్రను నిర్వహించుకోవాలని సూర్యాపేట డీఎస్పీ రవి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని 46వార్డులో నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదేవిధంగా సూర్యాపేట 10వార్డులో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో నిర్వహించిన పూజల్లో కాంగ్రెస్ నాయకుడు పందిరి మల్లయ్య పాల్గొని, అనంతరం అన్నదానం చేశారు. 45వార్డులో కౌన్సిలర్ గండూరి పావని కృపాకర్, రాంమూర్తియాదవ్, గాయత్రి, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బావ్ సింగ్, చల్లా లక్ష్మీకాంత్, ప్రసాద్. రాచర్ల కమలాకర్ పాల్గొన్నారు.

సూర్యాపేట టౌన్: జిల్లా కేంద్రంలోని గణేష్ చౌరస్తాలో మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. ముందుగా గణేష్ విగ్రహం వద్ద నిర్వహించిన పూజల్లో మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డి రాజా, ఇండ్ల ధనమూర్తి, దాసరి నర్సిరెడ్డి, గొట్టిముక్కల శ్రీనివాస్ రెడ్డి, వీరబ్రహ్మాచారి, దండ రవీందర్‌రెడ్డి, విక్రమాచారి పాల్గొన్నారు.

● వినాయకుడి కృప ప్రతిఒక్కరిపై ఉండాలని 45వార్డు కౌన్సిలర్ గండూరి పావని కృపాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో నిర్వహించిన హోమంలో పాల్గొని మాట్లాడారు. కులమతాలకు అతీతంగా వినాయక ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

కోదాడ రూరల్: మండలంలోని యర్రవరం కొత్తూరు గ్రామంలో గణేష్ మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని పీఏసీఎస్ చైర్మన్ నలజాల శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దాత శ్రీకాకుళం జనార్దనాచారి, నాగమణి దంపతులు, రావుల వెంకటేశ్వర్లు, జవాజి నాగేశ్వరరావు, నెట్టెం నాగేంద్రప్రసాద్, రాంబాబు పాల్గొన్నారు.

● అనంతగిరి మండలంలోని ఖానాపురం గ్రామంలో వినాయక విగ్రహం వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించిన, అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ముస్కు శ్రీనివాస్‌రెడ్డి, కోదాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బుర్ర సుధారాణిపుల్లారెడ్డి, కాంగ్రెస్ నాయకులు బుర్ర పుల్లారెడ్డి, జొన్నలగడ్డ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

● తిరుమలగిరి మండలంలోని తొండ గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద స్టార్ యూత్ సభ్యుడు గొల్లపెల్లి ప్రవీణ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు పొరెల్ల ప్రవీణ్, చిత్తలూరి సురేష్, సారయ్య, రాజు, అశోక్, రాకేష్, నవీన్ పాల్గొన్నారు.

మద్దిరాల: గణేష్ నవరాత్రోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో గణేష్ విగ్రహం ఎదుట నిర్వహించిన పూజల్లో భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సూర్యాపేటలో పూజల్లో పాల్గొన్న డీఎస్పీ రవి

కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి



నూతనంగా ఎన్నికైన తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య సభ్యులు

సూర్యాపేటటౌన్, సెప్టెంబరు 15: రాష్ట్ర ప్రభుత్వం కళాకారులను ఆదుకోవాలని తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు పులి కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కిరాణ ఫ్యాన్సీ మార్చంట్ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాటక సమాజ కళాకారులంతా ఐక్యంగా ఉన్నప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా గిలకత్తుల పుల్లయ్య, గౌరవ అధ్యక్షులుగా కలకుట్ల జగన్నాథరెడ్డి, తాడూరి లింగయ్య, గౌరవ సలహాదారులుగా పుల్లాభట్ల శ్రీధర్, శక్యం రామలింగమ్మ, కొత్త భద్రాయాచారి, ఉపాధ్యక్షులుగా సామల మల్లారెడ్డి, పోశం ఏడుకొండలు, రామినేని రాంబాబు, బాషపల్లి యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా గుండు వెంకటేశ్వర్లు, తుంగతుర్తి కార్యదర్శిగా దాసరి సత్యం, కోదాడ కార్యదర్శులుగా గోదాల సంజీవరెడ్డి, గురుబ్రహ్మాచారి, సూర్యాపేట కార్యదర్శులుగా దాచేపల్లి లక్ష్మి, మదూరి పాండురంగాచారి, జిల్లా కార్యనిర్వాహణ కార్యదర్శులుగా ధనియాకుల వెంకటేశ్వర్లు, కాసాని శ్రీనివాస్, కోశాధికారిగా వారణాసి సంగమేశ్వరప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా పశ్య కృష్ణారెడ్డి, జయప్రద, లింగాల శ్రీనివాస్, ఉప్పల వెంకటస్వామి, కొలపూడి వెంకయ్య, రాధాకృష్ణ, ముల్క సునీతారెడ్డిలు నియమితులయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బక్క పిచ్చయ్య, ధర్మారి వెంకటేశ్వర్లు, గుంటి పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.